# రోగికోరిందీ అదే!

"యురేకా" అని అరిచేడు ప్రభు. తమ తమ పనుల్లో మునిగి వున్న నలుగురూ తలెత్తి చూసేరు.

"సాధించేం" అన్నాడు అతడు. అతడి కంఠం ఉద్వేగంతో వణికింది. విజయంవల్ల వచ్చిన ఆనందంతో అతడి కళ్ళు మెరుస్తున్నాయి. దాదాపు ఆర్నెల్లనుంచి అతడో పరిశోధనలో మునిగి వున్నాడు.

అక్కడున్న వాళ్ళందరూ ఇంజనీర్లే. చాలా తెలివైన వాళ్ళు. పి. హెచ్. డీలు లేవుగానీ, అలాటి డాక్టరేట్‌లు వున్న వాళ్ళకి ఏమీ తీసిపోరు. అలా అని చెప్పి వృద్ధులు కూడా కారు. అందరూ యువకులు. నిరుద్యోగం వాళ్ళలో నిరాశని నింపింది. వాళ్ళ చదువూ, తెలివి తేటలూ వాళ్ళకి చిన్న ఉద్యోగాన్ని సంపాదించి పెట్టలేకపోయాయి. అది దేశం చేసుకున్న దురదృష్టం.

చాలా ఇంటర్వ్యూలలో ప్రతీసారి కలుసుకోవటంవల్ల వాళ్ళమధ్య స్నేహం అభివృద్ధి చెందింది. తరుచు పార్కులో

కలుసుకొనేవాళ్ళు. వాళ్ళు చెప్పుకునే కబుర్లు కూడా సినిమాల గురించీ, రాజకీయాల గురించీకాదు. 2012లో ప్రపంచం ఎలా వుంటుంది? శుక్రగ్రహంలో దొరికే ఖనిజాలూ—వగైరా సైంటిఫిక్ విషయాల మీద చర్చ జరిగేది. ఒక స్థాయి శ్రోత దాన్ని ఏ మాత్రం అర్థం చేసుకోలేడు.

ప్రభు, ఎలక్ట్రానిక్స్-కమ్యూనికేషన్‌లో డిగ్రీ సంపాదించాడు. మిగతా వాళ్ళు కూడా మెకానికల్, ఎలక్ట్రికల్ ఇంజనీర్లు. అందరూ మధ్య తరగతి కుటుంబాల్లోంచి వచ్చిన వాళ్ళే. పెళ్ళి కావలసిన చెల్లెళ్ళు, అక్కలూ వున్నవాళ్ళు. మాధవ్ తండ్రి రిటైరయి రెండు సంవత్సరాలయింది. ఇంకో ఒకటి రెండు నెలల్లో మాధవ్ గానీ ఉద్యోగం సంపాదించక పోతే ఆ కుటుంబం అంతా మూకుమ్మడి ఆత్మహత్య చేసుకోవలసిందే! మరీ ఇంత ఘోరం కాదు కానీ, ప్రతీవాళ్ళ పరిస్థితీ దాదాపు అదే!

మూడు నెలల్నుంచీ ప్రభు అదోలా వుండటాన్ని మిగతా వాళ్ళు గమనిస్తున్నారు. అతడు ఎప్పుడూ ఏదో దీర్ఘాలోచనలో వుండటం మొదలుపెట్టాడు. పార్కులో కూడా గడ్డి లేనిచోట కూర్చొని పుల్లతో నేల మీద ఏవో అంకెలూ, గుణింతాలూ వేస్తూ వుండేవాడు.

అతడు ఏదో గొప్ప విషయం గురించి ఆలోచిస్తున్నాడని వాళ్ళకి తెలుసు. అతడు చేస్తున్న పని గురించి ఎవరూ జోకు వెయ్యలేదు. ప్రభుత్వం గానీ, తమకు సరి అయిన వసతీ, పరికరాలూ సమకూరిస్తే తమలో ప్రతి ఒక్కడూ

ఒక్కొక్క గొప్ప విషయాన్ని కనుక్కుంటాడన్న నమ్మకం వాళ్ళకుంది. అది అహం కాదు, ఆత్మ విశ్వాసం!

—ఆ రోజు దాదాపు అయిదున్నర అవుతున్న వేళ పార్కులో ఒకమూల కూర్చొని ఆలోచిస్తూ ప్రభు వున్నట్టుండి "యురేకా" అని అరవగానే అందరూ అతడి వైపు చూసేరు.

"...వచ్చేసింది. ఇన్నాళ్ళ శ్రమకి ఫలితం కనబడింది. నేను కనుక్కున్నాను" అన్నాడు.

"ఏమిటి కనుక్కున్నావు నువ్వు?" మాధవ్ అడిగాడు.

"గామా కిరణాలద్వారా టెలివిజన్‌ని నాశనం చెయ్యటం, ధ్వని తరంగాల్ని కంట్రోల్ చెయ్యటం."

"అంటే" అన్నాడు రామం, అతడు ఓషన్ ఇంజనీరు.

ప్రభు వివరిస్తూ, "—దూరదర్శన్ కేంద్రంలో పని ఎలా జరుగుతుందో మీకు తెలిసే వుంటుంది" అన్నాడు. "...స్టూడియోలో గానీ, బైటగానీ కెమేరాతో వీడియో టేపుమీద పిక్చరూ, మాటలూ రికార్డు చేస్తారు. ఒకవేళ రెండూ విడివిడిగా చేసినట్టయితే, పిక్చరు ఎడిట్ చేసి కాప్స్యూలు తయారు చేస్తారు. కాప్స్యూల్స్‌ని తరువాత ప్రదర్శన టైముకి టి. వీ. టవర్ దగ్గర్నుంచి విడుదల చేస్తారు. అలాగే రేడియో స్టేషన్‌కి కూడా ఊరి బైట టవర్స్ వున్నాయి. మీడియం వేవ్ లెంగ్త్‌తో అది బహిర్గతపరిచే తరంగాల్ని మన ఇళ్ళలో రేడియో రిసీవ్ చేసుకుంటుంది.

ఇదీ టెక్నిక్” అని ఆగి, నెమ్మదైన స్వరంతో మెల్లగా అన్నాడు— “ఈ తరంగాల్ని నాశనం చేసే పరికరం నేను కని పెట్టాను. ఫ్రెండ్స్ ! నన్ను నమ్మండి !”

అందరూ వూపిరి బిగపట్టారు. అతడు చెప్పింది వెం టనే అర్థం కాలేదు. అయ్యేసరికి కంగారుపడ్డారు. నమ్మ శక్యం కాలేదు. కానీ ప్రభు శక్తి సామర్థ్యాల మీద వాళ్ళకి నమ్మకం వుంది.

అతడు నేల మీదే గీతలు గీసి, అంకెలు వేసీ, ఆ బొమ్మల్నీ, మాటల్నీ ఎలా ధ్వంసం చేయవచ్చో చెప్పాడు. అక్కడున్నది యింజనీర్లే కాబట్టి, అతడు చెప్పింది అర్థం అయింది చాలామటుకు. కానీ, పరిశోధన చేసి చూడటానికి పరికరాలు లేవు కాబట్టి, కేవలం థియరిటికల్‌గానే సంతృప్తి పడవలసి వచ్చింది.

“ఇది మనం చేసి చూడాలంటే యెంత కావలసి వుం టుంది ?” అని అడిగాడు రాఘవరావు. అక్కడున్న వాళ్ళల్లో అతడే కొద్దిగా ధనవంతుడు. అతడి తండ్రికి మెయిన్ బజార్లో చిన్న షావుంది. రాఘవరావుకి ఈ ప్రభు త్వం మీద నమ్మకం లేదు. అందరికీ ఉద్యోగాలు రావా లంటే వ్యవస్థ మారాలని వాదిస్తూ వుంటాడు.

“అయిదారు వేల దాకా ఖర్చవుతుంది అనుకుంటా. చిన్న పరికరం అది. నా వుద్దేశ్యం చేతిలో యిమిడిపోతుంది. ఏది ఏమైనా తయారు చేసిన తరువాత గానీ తెలీదు” అన్నాడు ప్రభు.

"నేను ఆ డబ్బు పెట్టుబడిపెడ్తాను" అన్నాడు రాఘవ రావు. "ప్రభూ! నీ మీద నాకు నమ్మకం వుంది. కానీ ఒక షరతు. ఆ పరికరాన్ని తయారుచేసిన తర్వాత దాన్ని మన వూరి దూరదర్శన్ మీదా, రేడియో స్టేషన్ మీదా ప్రయోగించటానికి నువ్వు అనుమతి ఇవ్వాలి."

"తయారు చేసిన తర్వాత ప్రయోగం చెయ్యకుండా ఎలా వుంటాం? మనం నిజంగా దాన్ని సాధించామో లేదో తెలియాలి కదా?" అన్నాడు మాధవ్.

"అలా ఒక నిముషం, రెండు నిముషాలూ ప్రయోగం చెయ్యటం కాదు. ప్రభుత్వం దిగివచ్చేవరకూ రేడియో స్టేషన్నీ, దూరదర్శన్నీ ఆపుచేస్తాం."

బాంబు పడ్డట్టూ అందరూ ఉలిక్కిపడ్డారు. ముందు తేరుకున్నది ప్రభు. అతడు కదిలి, "దేని కోసం ప్రభుత్వం దిగి రావాలి" అని అడిగాడు.

"మన కో పాతిక వేలు ఇవ్వాలి. అదీ బేరం" అన్నాడు రాఘవరావు.

"అంటే, ఒక రకంగా మనం ప్రభుత్వాన్ని బ్లాక్ మెయిల్ చేస్తున్నామన్నమాట" అన్నాడు మాధవ్.

"ఇది నేరం!"

"చదివిన చదువుకి మనకి జీవనాధారం చూపించ లేనందుకుగానూ ప్రభుత్వం దగ్గిర్నుంచి మనం పెనాల్టీ వసూలు చేస్తున్నాం, అంతే. మనకున్న విజ్ఞాన సంపదను ప్రభుత్వానికి చూపించి, 'ఓ మూర్ఖ ప్రభుత్వమా? ఈ యువకులను

గమనించు. వీరికి కనీసం ఒక చిన్న ఉద్యోగాన్ని చూపించ లేని నీ అసమర్థతకి నిదర్శనంగా వీరికి ఓ పాతిక వేలు కాంపె న్సేషన్ ఇవ్వు' అని అడుగుతున్నాం- అంతే."

దాని మీద వాదోపవాదాలు జరిగాయి. చివరికి ఓట్లు వేసుకున్నారు. ప్రభుకి అనుకూలంగా మూడు ఓట్లు పడ్డాయి. మెజారిటీ వచ్చింది.

"ప్రభుత్వం పాతిక వేలూ ఎలా అందజేస్తుంది ? పోలీ సులు వలవేసి మనల్ని పట్టుకుంటారు కదా !" అనుమానం వెలిబుచ్చాడు ప్రభు.

"రేడియో శబ్దాల్ని కంట్రోలు చెయ్యగలిగిన ఇంజ నీరుకి రావలసిన అనుమానం కాదది. ఆ విషయం నాకు వదిలిపెట్టు" అంటూ నవ్వాడు మాధవ్.

* * *

"ముఖ్యమంత్రిగార్కి,

అయ్యా !

మేం ఐదుగురం ఇంజనీర్లం. నిరుద్యోగులం. కానీ కాస్తో కూస్తో తెలివితేటలున్నవాళ్ళం. 'పనిలేనివాడి మెదడు దెయ్యాల కార్ఖానా' అని ఇంగ్లీషులో ఒక సామెత వున్నది. అలాటి కార్ఖానాలో ఒక పరికరం తయారు చేశాం. దాన్ని ఉపయోగించి రేపు రాత్రి ఎనిమిదింటికి మీ ఇళ్ళలో వున్న రేడియోలో వివిధభారతి, మీ టెలివిజన్ సెట్టూ ఒక పది నిముషాల పాటు ఆవుచేస్తున్నాం.

అలా ఆవుచెయ్యకుండా వుండాలంటే మీరు మాకు

పాతిక వేలు పరిహారం ఇవ్వవలసి వుంటుంది. గాంధీనగరంలో పార్కు పక్కన వున్న పాకలో సగం తెరిచి వున్న కిటికీలో గుండా ఆ డబ్బు పాకెట్ జారవిడవగలరు.

ఇట్లు,

ఇంజనీర్ల నిరుద్యోగ సంఘం."

ముఖ్యమంత్రి పి.య్యే. ఆ ఉత్తరాన్ని చదివి పక్కన చెత్తబుట్టలాటి ఫైల్లో పడేసేడు.

* * *

రెండు నిముషాల తక్కువ ఎనిమిదయింది.

రాఘవరావు, మాధవ్ టి.వీ. దగ్గర కూర్చున్నారు. పక్కనే ట్రాన్సిస్టర్ పెట్టుకున్నారు. అదే సమయానికి దూరదర్శన్ టవర్ పక్కన వున్న మైదానంలో తమ చేతి లోని పరికరంతో రెడీగా వున్నారు ప్రభు, రఘు.

ఎనిమిదవగానే పరికరాన్ని ఆన్ చేశాడు. సన్నటి శబ్దంతో అది పని చెయ్యసాగింది.

ఉన్నట్టుండి టెలివిజన్‌లో దృశ్యం ఆగిపోగానే, దాన్ని చూస్తున్న రాఘవరావు, మాధవ్ ఆనందంతో ఒక్కసారిగా ఎగిరి గంతేశారు. రాఘవరావు ట్రాన్సిస్టర్ పెట్టి చూశాడు. వివిధభారతిలో వస్తూన్న పాటల్ని మరో శబ్దం అధిగమిస్తూంది.

టి.వీ. ఆగిపోగానే వాళ్ళు ఎందుకు అంత సంతోష పడుతున్నారో ఇంట్లో వాళ్ళకి మాత్రం అర్థం కాలేదు.

* * *

ఆ మరునటిరోజు పేపర్లో ఒక చిన్న ప్రకటన పడింది.

"పుర ప్రముఖులకు,

ఆర్యులారా !

నిన్న రాత్రి ఎనిమిది గంటల నుంచీ ఎనిమిదీ పది వరకూ మీ టి.వి. పని చెయ్యకపోవటాన్నీ, మీ రేడియో పలకకపోవటాన్నీ గమనించి వుంటారు. అయ్యా ! అది సాంకేతిక లోపం వలన వచ్చినది కాదు. మేం కనుక్కున్న ఒక కొత్త పరికరం వలన కలిగినది.

సరీగ్గా ఒకటో తేదీ సాయంత్రం ఐదింటిలోపు గాంధీ నగర్ పార్కు పక్కన సగం తెరిచి వున్న కిటికీలోంచి పాతిక వేలు పడెయ్యమని ప్రభుత్వాన్ని హెచ్చరించాం. మా శక్తి నిరూపించుకోవటం కోసం ఈ రోజు నుంచీ ఐదు రోజుల పాటూ, అంటే ఒకటో తారీఖు వరకూ ప్రతి రోజు ఎనిమిది నుంచీ తొమ్మిది వరకూ టి.వి, వివిధభారతులు పనిచెయ్యకుండా ఆపుచేస్తున్నాం. మీ రేడియో, టి.వి. సరీగ్గా పని చెయ్యాలంటే ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకురావలసిన భాధ్యత మీ మీదే వున్నది.

ఇట్లు,

ఇంజనీర్ల నిరుద్యోగ సంఘం."

• • •

ముందురోజు ఆ ప్రకటనకి అంత ప్రాముఖ్యత లభించలేదు. కానీ ఆ రోజు రాత్రి అవి పని చెయ్యకపోయేసరికి వూరంతా చర్చనీయాంశం అయింది.

మరుసటిరోజుకూడా అలాగే జరిగేసరికి ముఖ్యమంత్రి పోలీస్ కమిషనర్‌ని తలవాచేటట్టు చివాట్లు పెట్టాడు.

మూడోరోజు టి.వీ. టవర్ దగ్గిరా, రేడియో స్టేషన్ దగ్గిరా దాదాపు వందమంది పోలీసుల్తో గట్టి బందోబస్తు ఏర్పాటు జరిగింది. ఎప్పుడూ టి.వీ. చూడని వాళ్ళు కూడా ఎనిమిదయ్యేసరికి ఇళ్ళల్లో చేరిపోయారు. సరిగ్గా, ఎనిమిది కొట్టింది. అంతే. వివిధభారతి నుంచి శబ్దాలూ, టి.వీ. ఆగి పోవటం ఒకేసారి జరిగింది. పోలీసులు గ్రద్దల్లా వెతికారు. ఏమీ దొరకలేదు. మరుసటి రోజు పేపర్లో పెద్ద పెద్ద అక్షరాల్తో వార్తలూ, ఎడిటోరియల్సూ వచ్చేసేయి. కొన్ని పేపర్లు ఇంజనీర్లని సమర్థించాయి. కొన్ని పత్రికలు ప్రభుత్వాన్ని, పోలీసు శాఖనీ దుయ్యబట్టాయి. ప్రభుత్వాన్ని తొందరగా నిర్ణయం తీసుకొమ్మని హెచ్చరించాయి.

చివరికి అనుకున్న రోజు వచ్చింది.

* * *

ఒకటో తారీఖు. సాయంత్రం అయిదయింది.

గాంధీనగర్ పార్కు !

నాలుగింటి వరకూ నిర్మానుష్యంగానే వుంది. ఒక్కొక్కరే వచ్చి చేరుకున్నారు. అయిదయ్యేసరికి ఇసుకవేస్తే రాలనంత జనం.

పార్కకి కొద్ది దూరంలో చుట్టూ నిలబడి చూస్తున్నారు. వాళ్ళలో సి.ఐ.డీలూ, పోలీసులు కూడా వున్నారు. కమిష

నర్ వాళ్ళనెలాగైనా బంధించాలని పట్టుదలతో వున్నాడు.

ఆ మనుష్యుల్లోనే అయిదుగురు యింజనీర్లు కూడా వున్నారు, ఏమి ఎరగనట్టు...

పేపర్లో ప్రకటన ఆలోచన గొప్పది. అంతమంది జనంలో వాళ్ళని ఎవరూ పట్టుకోలేరు. పాకలోకి వెళ్ళి చూసినా అక్కడేమీ వుండదు.

అయిదయిపోయింది.

ప్రభుత్వం డబ్బు ఇవ్వదల్చుకోలేదని అర్థం అయింది. తరువాత చర్య ఆలోచించటం కోసం వాళ్ళు అక్కణ్ణుంచి వెళ్ళిపోదామని కదలబోయారు.

అంతలో ఒక చిత్రం జరిగింది.

అక్కడ గుమిగూడిన పెద్ద మనుషుల్లో ఒకరు నెమ్మదిగా ముందుకు నడిచాడు. సూదిపడ్తే వినబడేంత నిశ్శబ్దం వ్యాపించింది.

అతడు పాక దగ్గిరకి వెళ్ళి చేతిలో చిన్న కవరు కిటికీగుండా జారవిడిచాడు. అతడు వెనక్కి వస్తూంటే ఇంకొకరు బయల్దేరారు. అతడూ ఒక కవరు లోపల పడేశాడు. దాదాపు పాతికమంది ఇలా చేసేరు.

రఘు, మాధవ్, మిగతావాళ్ళు ఏమీ అర్థం కాక చూస్తూ వుండిపోయారు. పోలీసులు కూడా నిశ్చేష్టులయ్యారు.

మాధవ్ సైగనందుకొని ప్రభు పార్కులో ఒక పొద చాటుకు వెళ్ళాడు. తన నెవరూ గమనించటం లేదని నిశ్చ

యించుకోని, ఒక తాడు లాగాడు. అక్కణ్నుంచి పాకలోకి సారంగం వుంది. దాని ద్వారా, లోపలి కవర్లన్నీ ఒక పాకెట్ ద్వారా బైటకొచ్చాయి.

ఈ లోపులో మిగతా నలుగురూ అక్కడికి చేరుకున్నారు. ఆత్రంగా ఒక్కో కవరూ విప్పి చదవసాగేరు. అన్నిటిలోనూ అయిదు పది రూపాయి నోట్లున్నాయి.

ఉదాహరణకి ఒక ఉత్తరంలో మాటలు వివరించి ఈ కథ ముగిస్తాను.

"ఇంజనీరు బాబులూ—

మేము కమలానగర్ వాసులం.

మీరు వివిధభారతీ, దూరదర్శన్‌లను పనిచేయకుండా చేస్తున్న విషయాన్ని గమనించాం. తిరిగి పని చెయ్యటానికి ప్రభుత్వం పాతికవేలు ఇస్తుందో లేదో తెలీదుగానీ, శాశ్వతంగా ఆవుచేయడానికి మా ఉడతాభక్తిగా ఓ రెండువందల యాభై రూపాయల్ని చందా లేసుకుని మీకు సమర్పిస్తున్నాం. స్వీకరించి, మా కోర్కె మన్నించండి.

ఇట్లు,

కమలానగర్ వెల్ ఫేర్ సొసైటీ."